సాక్షి సిద్దిపేట
బుధవారం, 29, నవంబర్, 2023

గజ్వేల్.. మరింత జిగేల్



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

- త్వరలో ఐటీ టవర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు
- నియోజకవర్గంలో ఏకకాలంలో 'దళిత బంధు' వర్తింపు
- ట్రిపుల్ఆర్ వచ్చిందంటే.. శాటిలైట్ పట్టణంగా ఆవిర్భావం
- కొండపోచమ్మ, నాచారం ఆలయాల అభివృద్ధికి చర్యలు
- గజ్వేల్ 'ప్రజా ఆశీర్వాద సభ'లో ముఖ్యమంత్రి కేసీఆర్

గజ్వేల్: తనకు జన్మనిచ్చిన సిద్దిపేట గడ్డ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోస్తే.. కొట్లాడి సాధించుకున్న స్వరాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి గజ్వేల్ ముఖ్యమంత్రిగా తనకు అవకాశం కల్పించిందని సీఎం కేసీఆర్ అన్నారు. త్వరలోనే ఈ ప్రాంతం ఐటీ టవర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో కొత్త కళను సంతరించుకోనున్నదని వ్యాఖ్యానించారు. మంగళవారం తన సొంత నియోజకవర్గం గజ్వేల్లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. హైదరాబాద్ నగరానికి అతి సమీపంలో ఉన్న గజ్వేల్ అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని చెప్పారు. ప్రత్యేకించి ఐటీ రంగంలో ఈ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ఐటీ మంత్రి కేటీఆర్ను ఇప్పటికే ఆదేశించగా... ఆ కార్యాచరణ వేగవంతమవుతోందన్నారు. కొద్ది రోజుల్లోనే కాలుష్య రహిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు డజను వరకు రాబోతున్నాయని అన్నారు. ట్రిపుల్ఆర్ (రీజినల్ రింగురోడ్డు)తో గజ్వేల్ అనుసంధానమయ్యే అవకాశమున్నందువల్ల అభివృద్ధి మరింత వేగవంతం కావడానికి అవకాశముందని తెలిపారు. శాటిలైట్ టౌన్గా ఈ ప్రాంతం ఆవిర్భవించనుందని స్పష్టం చేశారు.

అభివృద్ధికి అధ్యయన కేంద్రంగా..

నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి.. ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు అధ్యయన కేంద్రంగా ఆవిర్భవించిందని కేసీఆర్ చెప్పారు. ఇక్కడ నిర్మించిన 'మిషన్ భగీరథ' హెడ్వర్క్స్ ప్రాంతాన్ని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు చూసి వెళ్తున్నారని తెలిపారు. కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్లతో ఈ ప్రాంతం పసిడిపంటలకు కేంద్రమైందన్నారు. 50టీఎంసీల సామర్థ్యంతో మల్లన్నసాగర్ ఆసియాలోనే అతిపెద్ద మ్యాన్మేడ్ రిజర్వాయర్ అని, గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముంపు బాధితుల త్యాగం వెలకట్టలేనిదని, వారిని ఎల్లవేళలా కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని హామీ ఇచ్చా రు. గజ్వేల్ నియోజకవర్గంలోని దళితులందరికీ ఏకకాలంలో 'దళితబంధు' వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ హామీని వెంటనే అమలు చేస్తామన్నారు.

కేసీఆర్ ప్రాతినిధ్యం గజ్వేల్కు వరం

కేసీఆర్ ప్రాతినిధ్యం గజ్వేల్కు వరంగా మారిందని, అభివృద్ధిలో ఈ నియోజకవర్గం ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్రెడ్డి అన్నారు. మూడోసారి కేసీఆర్ను ఇక్కడి నుంచి పోటీ చేసి సీఎంగా అధికారాన్ని చేపట్టబోతుండడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామాలను తయారు చేయడానికి కేసీఆర్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని చెప్పారు.



మాట్లాడుతున్న వంటేరు

ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్పై మరింత దయ చూపాలని కోరారు. ఐటీ టవర్ల నిర్మాణంతో పాటు కొండపోచమ్మ, నాచారంగుట్ట ఆలయాల అభివృద్ధి, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారం, నిర్వాసితుల ఉపాధికి పరిశ్రమలు, తూప్రాన్లో వెజిటేబుల్ మార్కెట్ ఏర్పాటు, పెండింగ్లో ఉన్న మరికొన్ని సమస్యలు కూడా పరిష్కరించాలని కోరగా కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. సభలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్రెడ్డి ప్రసంగించారు. బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కె. కేశవరావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, సీనియర్ నేత, మాజీ జెడ్పీ చైర్మన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్రెడ్డి, మెదక్ జెడ్పీ చైర్మన్ హేమలతాశేఖర్గౌడ్, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్రెడ్డి, గజ్వేల్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్లు మాదాసు శ్రీనివాస్, జహంగీర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.